## అకాల వర్షంతో అన్నదాత ఆగమాగం



మల్లుపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 20,ప్రభాతవార్త:** అకాల వర్షం రైతన్నను ఆగమాగం చేసింది. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడానికి తెచ్చిన ధాన్యం తడిసిపోవడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. సోమవారం మల్లుపల్లిలో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రవీణ్ పరిశీలించారు. కామారం గ్రామంలో 15 ఎకరాల వరకు వరి పంట నేల వాలిందని ఏఈవో మదులిక తెలిపారు. పంటలను పరిశీలించాక నివేదిక ఉన్నతాధికారులకు సమర్పిస్తామని వారు తెలిపారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## శశిరెడ్డిపల్లి తండాలో నేలరాలిన ధాన్యం

**వెల్దుర్తి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త :** మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురవడంతో ధాన్యం,మామిడికాయలు నేల రాలిపోయాయి. మండలంలోని శశిరెడ్డిపల్లి తండా, చర్లపల్లి తండాలో ధాన్యం నేలరాలడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. అలాగే మామిడి చెట్ల నేలరాలడంతో నష్టం జరిగిందని, ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించాలని కోరారు. తమకు ఆర్థిక సాయం అందించాలని రైతులు అధికారులను కోరారు.



వడగండ్ల వానకు నేలరాలిన వరి ధాన్యం



సూపర్‌వైజర్స్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్ ప్రతీమాసింగ్

## జనగణనను విజయవంతం చేయాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

**కౌడిపల్లి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** ఎన్యుమరేటర్స్, సూపర్‌వైజర్స్ శిక్షణలో సంపూర్ణ అవగాహనతో 2027 డిజిటల్ జనగణనను విజయవంతంచేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతీమాసింగ్ పేర్కొన్నారు. సోమవారం కౌడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్యుమరేటర్, సూపర్‌వైజర్లకు జనగణన 2027 నిర్వహణలో భాగంగా మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతీమాసింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యుమరేటర్స్,సూపర్వైజర్లకు దిశానిర్దేశం చేశారు. శిక్షణలో ప్రతి అంశాన్ని అవగాహన కల్పించుకోవాలన్నారు. ఈ శిక్షణ మూడు రోజుల పాటు కొనసాగుతుందని ప్రశ్నలు, సమాధానాల రూపంలో జనగణనకు సంబంధించి వారి సందేహాలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, శిక్షణ పొందుతున్న ఎన్యుమరేటర్స్, సూపర్‌వైజర్స్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



అధికారులతో మాట్లాడుతున్నా కలెక్టర్ ప్రావిణ్య

**సంగారెడ్డి, ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** జిల్లాలో వైద్యసేవలు మెరుగుపరచడానికి వైద్యులు, సిబ్బంది క్రమశిక్షణ, చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పలు కీలక సూచనలు చేశారు. ఆసుపత్రుల నిర్వహణపై పూర్తిస్థాయి పర్యవేక్షణ కొనసాగించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్‌ను ఆదేశించారు. ప్రతి విభాగంలో సేవల నాణ్యత, రోగులకు అందుతున్న సౌకర్యాలపై పరిశీలన జరగాలని పేర్కొన్నారు. జిల్లాలో గుర్తించిన క్యాన్సర్ రోగుల వివరాలు అందుబాటులో ఉంచాలని, ప్రస్తుతం చికిత్స పొందుతున్న ప్రతి పేషెంట్‌తో ఫోన్ ద్వారా సంప్రదింపులు జరపాలని సూచించారు. క్యాన్సర్ డే కేర్ సెంటర్‌లో అందుబాటులో ఉన్న సదుపాయాలపై వారికి పూర్తి అవగాహన కల్పించి, అందరూ చికిత్స పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎస్పీఎం విద్యార్థులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. జెరియాట్రిక్ వార్డును ఆకర్షణీయమైన థీమ్‌తో పెయింటింగ్ చేయాలని, పాత బెడ్స్‌ను మార్చి కొత్తవాటిని ఏర్పాటు చేయాలని, అవసరమైన అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో అవుట్‌పేషెంట్ సేవలను (ఓపీలు) సమర్థవంతంగా స్ట్రీమ్‌లైన్ చేయాలని, రోగుల కోసం క్యూ లైన్లు స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోగులు ఇబ్బందులు పడకుండా సులభంగా సేవలు పొందేలా వ్యవస్థను మెరుగుపరచాలని సూచించారు.డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుపై కలెక్టర్ పలు సూచనలు చేస్తూ, ప్రతి రోగికి సంబంధించిన పూర్తి వైద్య వివరాలు సమగ్రంగా నమోదు కావాలని, ఇది భవిష్యత్తులో మెరుగైన చికిత్స అందించడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వసంత్ రావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ శశాంక, డాక్టర్ కవిత, వివిధ విభాగాల డాక్టర్లు, టీజీ ఆన్‌లైన్ బృందం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

### నోడల్ అధికారి రవికుమార్

**గజ్వేల్, ఏప్రిల్ 20 (ప్రభాతవార్త):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 20 నుండి 25 వరకు నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా అన్ని గురుకుల పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ సంక్షేమ వసతి గృహాలలో జిల్లా కలెక్టర్ నియమించిన ప్రత్యేక నోడల్ అధికారులు సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని గురుకుల విద్యాలయాలు, సంక్షేమ హాస్టళ్లలో పర్యటించి వసతులను పరిశీలించారు. అందులో భాగంగానే సోమవారం గజ్వేల్ ఎడ్యుకేషన్ హబ్‌లో గల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహానికి నోడల్ అధికారిగా నియమించబడిన డిపిఆర్ఓ బి.రవికుమార్ గజ్వేల్ ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించి వసతి గృహంలో విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి వసతి గృహంలో కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు విద్యా నాణ్యత ప్రమాణాలను పెంచడమే కాకుండా, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో పిల్లలు ఆరోగ్యంగా ఎదిగేందుకు అవసరమైన పౌష్టికాహారం, వసతిని ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వసతి గృహాన్ని నిర్వహించాలని, ఎల్లప్పుడూ హాస్టల్ పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని హాస్టల్ సంక్షేమ అధికారి స్వప్నకు సూచించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్‌లు చూస్తూ కాలం వృధా చేయకుండా భవిష్యత్తుకు పనికి వచ్చే పుస్తక పఠనం చేయాలని, ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లరాదని విద్యార్థులకు సూచించారు.



హాస్టల్‌లో ఉన్న బియ్యాన్ని పరిశీలిస్తున్న నోడల్ అధికారి రవికుమార్

# బసవేశ్వరుడి బోధనలు అందరికీ ఆచరణీయం

### వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి

**జోగిపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** విశ్వగురు బసవేశ్వరుడు ప్రతీ ఒక్కరికి ఆదర్శప్రాయుడని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సోమవారం జోగిపేటలో లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బసవేశ్వర జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని బసవేశ్వర విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త, రాజనీతిజ్ఞుడు అని కొనియాడారు. ఆయన బోధనలు, ఆశయాలు ఆచరణీయమని పేర్కొన్నారు. ప్రతీ వ్యక్తి జీవితంలో కష్టానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, శ్రమకు గౌరవం ఇవ్వాలని అపుడే తగిన ఫలితాలను సాధించగలుగుతామని చెప్పిన గొప్ప వ్యక్తి బసవేశ్వరుడని తెలిపారు.

**ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం...**

సోమవారం జోగిపేటకు విచ్చేసిన దామోదర్ రాజనర్సింహ పట్టణంలోని పదవ వార్డులో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. వార్డుకు చెందిన బస్వపురం మల్లమ్మ, మల్లయ్య నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశానికి విచ్చేసి, ఆ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల గృహావసరాలు తీర్చేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించిందని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇళ్లు లేని ప్రతిఒక్కరూ నిర్మించుకునేలా తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, మున్సిపల్ చైర్మన్ ఎస్.క్రిష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, కౌన్సిలర్ రేఖాప్రవీణ్, కౌశికె రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాగా అంతకుముందు తహసీల్దార్ కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు.

# తాగునీరు, విద్యుత్‌కు ప్రథమ ప్రాధాన్యం : ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, ఏప్రిల్ 20, ప్రభాతవార్త :** ప్రజలకు తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం అంశంలో అలసత్వం వహించవద్దని ఆయా శాఖల ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే జీఎంఆర్ సూచించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో అమీన్‌పూర్, పటాన్‌చెరు బల్దియా డిప్యూటీ కమిషనర్లు, ఆయా మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, చైర్మన్లు, విద్యుత్, నీటిపారుదల, పిసిబి, జాతీయ రహదారులు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిపారుదల, జలమండలి, పరిశ్రమలు,టౌన్ ప్లానింగ్ శాఖల అధికారులతో వివిధ అంశాలపై ఎమ్మెల్యే జీఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత వేసవి కాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు, నిర్దేశించిన సమయంలో తాగునీరు పంపిణీ చేయాలని సూచించారు. లో వోల్టేజి సమస్యలు తలెత్తకుండా నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఐదు మున్సిపాలిటీలకు మంజూరైన 75 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు త్వరలో శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. జిహెచ్ఎంసి పరిధిలోని 9 డివిజన్ల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధిపనుల్లో వేగం పెంచాలని సూచించారు. నూతన కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వంతో చర్చించి మరిన్ని నిధులు కేటాయించబోతున్నట్లు తెలిపారు. అమీన్‌పూర్ పరిధిలో రూ.23కోట్లతో 55 పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. నూతన కాలనీలకు తాగునీటిని పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని జలమండలి జిఎం శ్రీనివాస్‌కు సూచించారు. నూతన పైపులైన్ల ఏర్పాటు కోసం నిధులు కేటాయించాలని ఇప్పటికే జలమండలి ఎండి అశోక్‌రెడ్డికి విన్నవించడం జరిగిందని తెలిపారు. బల్దియా పరిధిలోని పార్కుల సుందరీకరణకు రూ. 10 కోట్ల నిధులు మంజూరయ్యాయని సంబంధిత అధికారులు తెలిపారు. శరవేగంగా జరుగుతున్న పట్టణీకరణ మూలంగా ప్రభుత్వ భూముల లభ్యత అత్యంత ఆవశ్యకమని, ప్రజాప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగానే ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములను పరిశ్రమలకు కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే జీఎంఆర్‌ను కోరారు. ఇందుకు భిన్నంగా పరిశ్రమల పేరుతో ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్, పరిశ్రమలకు కేటాయిస్తే ప్రజా ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. జిన్నారం మున్సిపల్ పరిధిలోని నల్తూరులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులు కొనసాగుతున్నాయని, త్వరలో శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 993 సర్వే నెంబర్‌లో నవోదయ పాఠశాల ఏర్పాటుకు భూమి కేటాయింపు జరిగిందని, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు భూమి కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. ఇదే సర్వే నంబర్‌లో ఎస్టిపి కోసం కేటాయించిన 10 ఎకరాల భూమిని ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా రద్దు చేయాలని కలెక్టర్‌ని కోరనున్నట్లు తెలిపారు. గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని అయ్యమ్మ చెరువు కాలుష్య సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఎస్టిపి ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. మున్సిపాలిటీ, జిహెచ్ఎంసిపరిధిలో విలీనమైన గ్రామాల్లోని గ్రామ కంఠాల పరిధిలో ఇళ్ల అనుమతుల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ అంశంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కలిసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించకూడదని, నిధుల కొరత ఉంటే తనను నేరుగా సంప్రదించాలని కోరారు. పటాన్‌చెరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

## కో-ఆప్షన్ పదవి కోసం పైరవీలు

**గజ్వేల్, ఏప్రిల్ 20 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో కో-ఆప్షన్ స్థానాలకు నేటితో గడువు ముగియనుండడంతో స్థానిక నాయకులు కో-ఆప్షన్ పదవి కోసం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం అడ్డగోలుగా దరఖాస్తులు చేసుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత శాఖ అధికారులకు నామినేషన్లను దాఖలు చేశారు. ఇదిలా వుండగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో 20 వార్డులకుగానూ నలుగురు సభ్యులకు కో-ఆప్షన్ పదవి దక్కే అవకాశం ఉంటుంది. అందులో మైనార్టీలకు, క్రిస్టియన్, ఇతరులకు రిజర్వేషన్ల వారీగా కో-ఆప్షన్ పదవులు దక్కనున్నాయి. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తమ పార్టీకి చెందిన నాయకులకు ప్రతి వార్డులో కో-ఆప్షన్ పదవి ఇస్తామని బుజ్జగించి కౌన్సిలర్ల పోటీ నుండి అభ్యర్థులను తప్పించారు. కో-ఆప్షన్ పదవికి నామినేషన్లు స్వీకరించడంతో కో-ఆప్షన్ పదవి కోసం మాజీ కౌన్సిలర్లు అల్వాల శ్రీనివాస్, అల్వాల బాలేష్, ఖాసీం, నవాజ్‌మీరా, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఫాతిమా, మారగోని లావణ్య, యూనుస్‌తోపాటు మరో ఐదారుగురు బిఆర్ఎస్ నాయకులు కో-ఆప్షన్ పదవి కోసం దరఖాస్తు చేసుకున్నారు. కో-ఆప్షన్ పదవికి దరఖాస్తు చేసుకున్న తర్వాత పదవి కోసం బిఆర్ఎస్ పార్టీ నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కో-ఆప్షన్ పదవి కోసం సుమారు 25 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. కో-ఆప్షన్ పదవులు ఎవరికి దక్కేనో వేచిచూడాల్సిందే. కాంగ్రెస్, బిజెపి నాయకులకు కో-ఆప్షన్ పదవికి అర్హత లేకపోవడంతో పార్టీ నాయకులు ఎవరూ కో-ఆప్షన్ పదవి కోసం నామినేషన్ దాఖలు చేయలేదు.




గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం

# ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాతే మార్కెట్‌కు తీసుకురావాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త**

జిల్లాలో రైతులు ధాన్యాన్ని వ్యవసాయ క్షేత్రాల వద్ద తేమ శాతం వచ్చే వరకు ఆరబెట్టుకుని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి రైతులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం హుస్నాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీని సందర్శించిన కలెక్టర్ ధాన్యం కొనుగోలుప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హుస్నాబాద్ మార్కెట్ కమిటీలో మొక్కజొన్న, ధాన్యం ఒకేసారి కొనుగోలు జరుగుతున్నందున కొత్తగా ధాన్యం తీసుకువచ్చే రైతులకు స్థలకొరత ఏర్పడిందన్నారు. రైతులు వ్యవసాయ క్షేత్రాల వద్దే ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టి తర్వాత హుస్నాబాద్ మార్కెట్ సెంటర్‌కు తీసుకురావాలని సూచించారు. హుస్నాబాద్ మార్కెట్(ఎఫ్ఏసీ) సెంటర్‌లో స్థల కొరత ఉన్నందున రైతులు సమీపంలోని పోతారం-ఎస్, అరెపల్లి ఐకెపి కొనుగోలు కేంద్రాల్లో కూడా తమ వరి ధాన్యాన్ని విక్రయించుకోవచ్చని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి తగిన విధంగా ధాన్యాన్ని సిద్ధం చేసుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. అనంతరం మండలంలోని జిల్లెలగడ్డ గ్రామంలో ఉన్న గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వెల్ఫేర్ వీక్ కార్యాచరణలో ఈ వారం సంక్షేమ విద్యాసంస్థల్లో శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని సంక్షేమ విద్యాసంస్థలలో వంటగదులు, మరుగుదొడ్లు, స్టోర్ రూమ్‌లు, తరగతి గదులు, వరండాలు, మైదాన పరిసరాల్లో సమగ్ర శుభ్రత నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించేలా చూడాలని సూచించారు. గురుకుల ప్రాంగణాన్ని మొత్తం పరిశీలించిన కలెక్టర్ వంటగది, మరుగుదొడ్లు, వరండాలను వెంటనే శుభ్రపరచాలని ఆదేశించారు. వంటగదిలో ఆహార పదార్థాలను తనిఖీ చేసిన కలెక్టర్ మెనూకి అనుగుణంగా ఆహారం వండాలని సూచించారు. పాలకూర పప్పు పలచగా ఉండ టం, పచ్చి పులుసును వండడంపై వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పిల్లలకు అలాంటి ఆహారం ఇవ్వకూడదని హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీఓ రామ్మూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, డీసీఎస్ఓ తనూజ, డీఎంసీఎస్ గోపీకృష్ణ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

**బస్వాపూర్‌లో...**

**కోహెడ, ఏప్రిల్ 20, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె.హైమావతి సోమవారం సందర్శించి పరిశీలించారు. కేంద్రంలో గన్ని బ్యాగ్‌లు, తేమ శాతం కొలిచే యంత్రాలు, కంటాలు, పాడి క్లీనర్లు, వేసవి కాలం దృష్ట్యా తాగునీటి వసతి, అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా టార్పలిన్ కవర్లు అందు బాటులో ఉంచుకోవాలన్నారు. తేమశాతం చెక్ చేసి తేమ శాతం రాగానే వెంటనే లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్టర్ తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. లారీల కొరత ఉందని చెప్పడంతో వెంటనే లారీలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు.



బసవేశ్వర విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హైమావతి

## ఘనంగా మహాత్మా బసవేశ్వర జయంతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి/కొమురవెల్లి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త :**

విశ్వ గురువు శ్రీ మహాత్మా బసవేశ్వర 893వ జయంతి వేడుకలు జిల్లాలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల బైపాస్ చౌరస్తాలోని బసవేశ్వరుడి విగ్ర హానికి సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్య క్రమంలో బిసి సంక్షేమశాఖ అధికారి సయ్యద్ రఫీ, వివిధ కుల సంఘాల నాయకులు మహాదేవుని శ్రీనివాస్, సింగోజి మురళికృష్ణచార్యులు తదిత రులు పాల్గొన్నారు.

**కొమురవెల్లిలో...**

మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో సోమవారం మహాత్మా బస వేశ్వర 893వ జయంతి సందర్భంగా మహాగణపతి పూజ, మహాత్మా బసవేశ్వరుల పూజ కార్యక్రమంతోపాటు ఆదిత్య పరాశ్రీ, అంబాత్రయ క్షేత్రం మహాస్వాముల వారిచే మహాత్మా బసవేశ్వరుల పూజ కార్యక్రమాలు నిర్వహించారు.మహాత్మా బసవేశ్వర జయంతి కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ ఏఈవోలు సుదర్శన్, బుద్ది శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ నీల శేఖర్, వీరశైవ లింగాయత్‌సమాజం జిల్లా అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, మాజీ సర్పంచ్ మల్లికార్జున్, వార్డు సభ్యులు మహాదేవుని శశిధర్, అర్చక సిబ్బంది, ప్రజలు, భక్తులు పాల్గొ న్నారు. భక్తులకు పూజానంతరం ప్రసాద వితరణ చేసి ఆశీర్వాదం అందించారు.

**మిరుదొడ్డిలో...**

కులమతాలకు అతీతంగా అన్నింటికీ ప్రాధాన్య మిచ్చిన గొప్ప వ్యక్తి మహాత్మా భగవాన్ శ్రీబసవే శ్వర 893వ జయంతి వేడుకలను మిరుదొడ్డిలో వీరశైవ లింగాయత్ లింగ బలిజ మండల అధ్య క్షుడు పూదూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ విశ్వగురు మహాత్మా బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ లింగ బలిజ ఉపాధ్యక్షులు రాజమౌళి, ప్రధాన కార్యదర్శి పూదూరి రాజు, పూదూరి వీరేశం, పూదూరి కృష్ణ, పూదూరి మహేష్, పూదూరి నవీన్, బిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఎం.డి.జాహింగీర్, తుమ్మల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రైతుభరోసా వీడియో కాన్ఫరెన్స్ వీక్షణ

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త :** రైతుభరోసా రెండో విడతలో భాగంగా సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాసారం మండలంలో సిఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించగా ఈ కార్యక్రమాన్ని మండల పరిధిలోని పొన్నాల రైతువేదికలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి స్వరూపారాణి, ఆధ్వర్యంలో మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనాథ్, సర్పంచ్ అమ్ముల వెంకటయ్య, ఉప సర్పంచ్ సృజన సంపత్ యాదవ్, ఎఈవోలు మీరా, నవనీత, రైతులు కార్యక్రమాన్ని వీక్షించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

### జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు.ప్రజావాణిలో దరఖాస్తులు అందజేసిన బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో 163 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తు దారులకు న్యాయం చేసి తిరిగి దరఖాస్తు పెట్టుకోకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్వో నాగరాజమ్మ, ఎఓ రాజ్‌కుమార్, వివిధశాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

## పిడుగు పడి ఇద్దరికి తీవ్ర గాయాలు

### మూడు కోతులు మృతి

**నర్సాపూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త :** ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన గాలివానకు పిడుగుపడి మూడు కోతులు మృతి చెందగా ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన నర్సాపూర్ మండలం గూడెంగడ్డ గ్రామంలో జరిగింది. గ్రామస్థులు కథనం ప్రకారం... గూడెంగడ్డ గ్రామానికి చెందిన నవాపేట బాలమల్లేష్, పండుగ రవి కలిసి ఆదివారం సాయంత్రం పాడిగేదెలు తోలుకొని మేతకోసం వెళ్లారు. ఈ క్రమంలోనే ఈదురు గాలులతో కూడిన వర్షం కురివగా, ఈదురు గాలులు ఉరుములు మెరుపులు రావడంతో సమీపంలో గల చింత చెట్టు కిందకు వెళ్లారు. ఈ క్రమంలోని పెద్ద ఉరుము ఉరిమి సమీపంలో పిడుగు పడింది. అక్కడే ఉన్న మూడు కోతులు పిడుగుపాటుకు మృతిచెందగా బాల మల్లేష్ రవికి గాయాలై భయందోళనకు గురై గట్టిగా అరిశారు. ఇదివిన్న గ్రామస్థులు కుటుంబ సభ్యులు వెంటనే వెళ్లి గాయపడిన వీరిని నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు పరీక్షి ంచిన అనంతరం మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారు చికిత్స పొందుతున్నారు.

## మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య

**వర్గల్, ఏప్రిల్ 20 (ప్రభాతవార్త):** మనస్థాపంతో ఒక వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వర్గల్ మండలం తునికిఖాల్సా గ్రామంలో చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం... తునికిఖాల్సా గ్రామానికి చెందిన యజ్ఞం శ్రీనాథ్(25) కొంత కాలంగా భార్య పూజతో సంసార విషయంలో గొడవలు జరుగుతుండగా, నాలుగు రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్థాపానికి గురైన శ్రీనాథ్ సోమవారం ఉదయం గ్రామంలో అద్దెకు ఉంటున్న ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి యజ్ఞం కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


సిర్గాపూర్‌లో బసవేశ్వర జయంతి వేడుకలు


కార్యక్రమంలో నిర్మలాజగ్గారెడ్డి


న్యాల్‌కల్‌లో బసవ జయంతి దృశ్యం


శేరిదామర్‌గిద్దలో బసవన్న జయంతి దృశ్యం


నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు


నివాళులు అర్పిస్తున్న మాజీమంత్రి చంద్రశేఖర్


నివాళులు అర్పిస్తున్న నరోత్తం దృశ్యం


మనూర్‌లో బసవేశ్వర జయంతి దృశ్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి


విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం


విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం


ఝరాసంగంలో బసవేశ్వర జయంతి దృశ్యం

# ఘనంగా మహాత్మా బసవేశ్వర జయంతి

**సిర్గాపూర్‌లో...**

**సిర్గాపూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో సోమవారం బసవేశ్వర జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బసవేశ్వరుడి చిత్ర పటానికి పూలమాలలువేసి ఉత్సవాలను నిరాడంబరంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో బసవదళ్ అధ్యక్షులు విజయ్‌కుమార్‌పాటిల్, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌పాటిల్, కోశాధికారరి మాదపతి శివకుమార్, డిటి హేమంత్‌కుమార్, ఎంఈఓ నాగారం శ్రీనివాస్, ఎంపిఓ అరుణ్‌రాజ్, శ్రీకర్, గూడూరి దత్తరాజ్, ఓంనాథ్, రాచయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

**సంగారెడ్డిలో...**

**సంగారెడ్డి బ్యూరో, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
బసవేశ్వర జయంతి సందర్భంగా టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి సంగారెడ్డిలోని బసవేశ్వర విగ్రహాలకు పూల మాలలు సమర్పించి నివాళులు అర్పించారు. మొదట సంగారెడ్డి పట్టణంలోని ఎలక్ట్రిసిటీ కార్యాలయంలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు. తరువాత బైపాస్ రోడ్డులోని బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో నిర్మలాజగ్గారెడ్డిని, మున్సిపల్‌చైర్మన్, కౌన్సిలర్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితసంతోష్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, నాయకుడు కూన సంతోష్, కౌన్సిలర్లు వంశీ, సతీష్‌రెడ్డి, హరిష్, లింగాయత్ సమాజ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

**న్యాల్‌కల్ మండలంలో...**

**న్యాల్‌కల్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన న్యాల్‌కల్‌తోపాటు మండలంలోని హద్నూర్, గుంజోటి, వడ్డి తదితర గ్రామాల్లో సోమవారం బసవేశ్వర జయంతిని ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్, మండల పరిషత్, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బసవేశ్వరుడి చిత్రపటాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి వేడుకలను జరుపుకున్నారు. న్యాల్‌కల్, హద్నూర్ గ్రామాల్లోని బసవేశ్వరుడి ఆలయంలో పూజాకార్యక్రమాలు నిర్వహించి బసవన్నకు డోలారోహణం నిర్వహించారు. ఆయాకార్యక్రమాల్లో తహసీల్దార్ ప్రభులు, ఇంచార్జి ఎంపిడిఓ నరేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, గార్లపల్లి శివరాజ్, పడకంటి శ్రీనివాస్, ఆంజనేయులు, మన్నూర్ అశోక్, సిద్దలింగయ్యస్వామి పాల్గొన్నారు.

**శేరిదామర్‌గిద్దలో...**

**నాగల్‌గిద్ద, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన నాగల్‌గిద్దతోపాటు మండలంలోని గ్రామాల్లో బసవేశ్వర జయంతిని ఘనంగా జరుపుకున్నారు. శేరిదామర్‌గిద్దలోని పంచాయతీ కార్యాలయంలో బసవేశ్వరుడి చిత్రపటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు, ఉపసర్పంచి శేరికర్ పండరినాథ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**జహీరాబాద్‌లో...**

**జహీరాబాద్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
సోమవారం బసవేశ్వరుడి జయంతిని పురస్కరించుని ఉగ్గెల్లి చౌరస్తాలోని బసవేశ్వరుడి కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ మాజీచైర్మన్ వై.నరోత్తంలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండలబిఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, నాయకులు నామ రవికిరణ్, హోతి గ్రామసర్పంచి మచ్చేందర్, కౌన్సిలర్లు గౌస్, గౌరీ, విశ్వేశ్వర్, నాయకులు చిన్నరెడ్డి, మడపతి శివకుమార్, లింగాయత్‌సమాజ్ అధ్యక్షులు రాజశేఖర్ శెట్కార్, కార్యదర్శి రేకుల్లి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

**బసవేశ్వరుడికి మాజీమంత్రి చంద్రశేఖర్ నివాళి...**
బసవేశ్వర జయంతి సందర్భంగా పట్టణంలోని జాతీయ రహదారి పక్కలో ఉగ్గెల్లి చౌరస్తాలో ఉన్న బసవేవ్వర విగ్రహానికి మాజీ మంత్రి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహ్మద్ యునూస్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కండెం నర్సింలు, శ్రీకేతకి సంగమేశ్వర ఆలయకమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌పాటిల్, ఎఎంసి డైరెక్టర్ కిషన్, సర్పంచి రాజ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు హుగ్గెల్లి రాములు, నయిమ్ ఆహ్మద్, వీర్‌శెట్టి, గోసొద్దిన్, బనార్ధన్, చంద్రశేఖర్, లింగాయత్‌సమాజ్ అధ్యక్షులు రాజశేఖర్ శెట్కార్, కార్యదర్శి రేకుల్లి సుభాష్, లింగాయత్ సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

**బవసన్నకు నివాళులు అర్పించిన నరోత్తం...**
పట్టణ శివారులోని జాతీయ రహదారిపై ఉగ్గెల్లి చౌరస్తాలోని బసవేశ్వరుడి విగ్రహానికి ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, సిడిసి మాజీ చైర్మన్ ఉమాకాంత్‌పాటిల్, కౌన్సిలర్ నామా రవి కిరణ్, విశ్వేశ్వర్, ఆర్.సుభాష్, జి.నర్సింలు, సుభాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**మనూర్‌లో...**

**మనూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన మనూర్‌తోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం బసవేశ్వర జయంతిని ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని బసవేశ్వర ఆలయాల్లో విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆయాకార్యక్రమాల్లో సర్పంచులు కె.దిగంబర్‌రెడ్డి, గంపల సిద్దారెడ్డి, కర్ణం కృష్ణ, సంగమేశ్వర్, గంగయ్యస్వామి, శరణప్ప, నందప్ప, మధుసూదన్‌రావుపాటిల్, బిరదర్ సంగప్ప, రాజేందర్, సిద్రాం, సుధాకర్, పి.సంగమేశ్వర్, శంకర్, అఖిలేశ్వర్, రాజ్‌కుమార్, బసవరాజ్, సుభాష్, రమేష్, నరసింహారెడ్డి, నవీన్ రెడ్డి, దశరథ్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

**నారాయణఖేడ్‌లో,..**

**నారాయణఖేడ్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మండలపరిధిలోని జుక్కల్‌గ్రామంలో బసవేశ్వర జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్‌కుమార్‌శెట్కార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన గ్రామంలోని బసవేశ్వర విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలందరికీ బసవ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచి వినయ్, వార్డుసభ్యులు మల్లయ్య, వీరన్న, రామన్న, రావి, మల్లప్ప, అంజన్న, బానాపురం రాజు, రుక్మిణి గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు, ఆనంద్‌స్వామి, స్థానిక పెద్దలు, ప్రతినిధులు, నాయకులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**సదాశివపేటలో...**

**సదాశివపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
సదాశివపేటలో బసవేశ్వరుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక బసవేశ్వర మందిరంలో శాస్త్రోక్తంగా అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మున్సిపల్‌చైర్మన్ మనుపల్లి అంజమ్మ సత్యనారాయణ కార్యనిర్వాహక అధ్యక్షుడు అనిమిశెట్టి జయప్రకాశ్, ప్రధానకార్యదర్శి సిందోలు వినోద్, కోశాధికారి ఆత్రామాధి రాచన్న, జిల్లా ఉపాధ్యక్షుడు అడ్వకేట్ వీరమహేందర్ తదితరులు పాల్గొన్నారు.

**వీరన్నగూడెంలో...**

**గుమ్మడిదల, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని వీరన్నగూడెం వార్డులో బసవేశ్వర జయంతిని సంప్రదాయ శోభతో నిర్వహించారు. శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయప్రాంగణంలోని బసవేశ్వర విగ్రహం వద్ద సంఘం అధ్యక్షుడు బారాది ప్రసాద్ నాయకత్వంలో మున్సిపల్‌చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంఘసభ్యులు పుష్పార్చనలుచేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు షేక్ గౌసియా హుస్సేన్, సురభి కుమార్‌గౌడ్, సద్ది జైపాల్‌రెడ్డి, సంఘం ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, అలాగే రమేష్ అప్ప, అఖిల్, నితిన్, శివనగాలు, విజయ్, సతీష్, శేఖర్, గుమాకర్, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

**ఝరాసంగంలో...**

**జరాసంగం, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన ఝరాసంగంతోపాటు ఆయా గ్రామాల్లో బసవేశ్వర జయంతిని మండల లింగాయత్ సమాజ్ అధ్యక్షులు రవిపాటిల్ ఆధ్వర్యంలో బసవేశ్వరుడి చిత్రపటానికి పూజాకార్యక్రమాలు నిర్వహించి జరుపుకున్నారు. కార్యక్రమంలో గాలప్పపాటిల్. మాలిపటేల్, శ్రీనివాస్‌పాటిల్, జగదీశ్వర్‌పాటిల్, ఉదయ్‌శంకర్‌పాటిల్, బొగ్గుల జగదీశ్వర్‌పాటిల్, సజ్జన్‌శెట్టి నాగేశ్వర్, గడ్డం మల్లికార్జునపాటిల్, సంతోష్‌కుమార్, గడ్డం బక్కప్ప, రాజేందర్‌సింగ్, అమర్‌సింగ్, సంజుసింగ్, సోతుల నాగేశ్వర్, వీరన్నపాటిల్, విశ్వనాథ్, నాగేందర్‌పాటిల్, బాల రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యాన్ని మధ్య దళారులకు అమ్మి మోసపోవద్దు

**-ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
రైతులు తాము ఆరుగాలంకష్టించి పండించిన ధాన్యాన్ని మధ్యదళారులకు అమ్ముకొని మోసపోవద్దని పేర్కొంటూ ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలలోనే రైతులు ధాన్యాన్ని అమ్మాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్ మండలపరిధిలోని ఖాజీపేట గ్రామంలో గ్రామ మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ఆమె చేతులమీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచులఫోరం మండల అధ్యక్షులు మధుకర్‌రెడ్డి, సర్పంచులు యాదగిరిగౌడ్, మాజీసర్పంచి కరుణాకర్, ఎంపిడివో, ఆర్ఐ సిద్ధిరామిరెడ్డి, ఎవో దీపిక, వివోఎ సప్న, గ్రామస్థులు మహిపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మదన్మోహన్, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీ


హాస్టల్ తనిఖీ నిర్వహిస్తున్న మండల అధికారి వేణుగోపాల్

**కొండాపూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
కొండాపూర్ మండలపరిధిలోని మల్లెపల్లి ప్రభుత్వ షెడ్యూలు కులాల బాలికల హాస్టల్‌ను మండల అధికారి వేణుగోపాల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు ప్రజాపాలన ప్రగతిప్రణాళికలో భాగంగా ఈతనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈసందర్భంగా హాస్టల్ లోని కిచెన్, స్టోర్ రూమ్, టాయిలెట్స్ తదితర వసతులను పరిశీలించారు. అక్కడ నివసిస్తున్న బాలికలను అడిగి వారిసమస్యలు, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహారాన్ని కూడా పరిశీలించారు. హాస్టల్‌లో కల్పిస్తున్న వసతులు సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొన్న వేణుగోపాల్, నిర్వాహణను మెరుగ్గా నిర్వహిస్తున్న హాస్టల్ వార్డెన్ ప్రసన్నను అభినందించారు.

## వైభవంగా ఆద్యశిలాస్థాపనోత్సవం

**పటాన్‌చెరు, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
సంగారెడ్డి నియోజకవర్గం ఫసల్‌వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ప్రాంగణం నేడు ఆధ్యాత్మికశోభతో విరాజిల్లుతోంది. అక్షయతృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని, పీఠాధిపతులు బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వరశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో అత్యంత అరుదైన మహమ్మేరు దేవాలయ నిర్మాణానికి ఆద్యశిలాస్థాపనోత్సవం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జి నీలం మధుముదిరాజ్ పాల్గొన్న ఈ ఉత్సవాలు వేద మంత్రోచ్ఛారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య శాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం గణపతిపూజ, గురుపూజతో ఉత్సవాలు అంకురార్పణ జరుపుకున్నాయి. అనంతరం భక్తులందరూ కలిసి సామూహికంగా నిర్వహించిన శతావర్తన హనుమాన్‌చాలీసా పారాయణంతో ఆ ప్రాంతమంతా భక్తి భావంతో నిండింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రతువులను వేదపండితులు శాస్త్రీయంగా నిర్వహించారు. పూజాకార్యక్రమాల్లో పాల్గొంటున్న నీలం మధుకు ఆలయ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఈ మహత్తర కార్యక్రామానికి భారీగా తరలివచ్చిన భక్తుల కోసం నిర్వాహకులు అన్నప్రసాద వితరణ, తీర్థప్రసాదాల ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కస్తూరిబా పాఠశాలలో కరాటే బెల్ట్ పరీక్షాపోటీలు


సర్టిఫికెట్‌లను అందజేస్తున్న ప్రిన్సిపాల్, కరాటే మాస్టర్లు తదితరులు

**నర్సాపూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి లో గల కస్తూరిబా పాఠశాలలో సోమవారం రెంజుకి చోటే కాల్ కరాటే బెల్ట్ పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈకరాటే బెల్ట్‌ల పోటీ పరీక్షల్లో పాల్గొన్న రెంజుకి చోటే కాల్ కరాటే మాస్టర్ రాష్ట్ర అధ్యక్షులు జి.అశోక్ మాట్లాడుతూ ఈ రెంజుకి చోటే కాల్ కరాటే బెల్ట్ పరీక్షల్లో సుమారు 60మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో కె.అక్షరకు బ్రౌన్ సెకండ్ క్యూ, అమ్ములు, ప్రవళిక, ఇషిక, అమ్ము, అక్షయ, నందిని, దీపిక ఆరంజ్‌బెల్ట్ సాధించారని, మిగతా 52మంది ఎల్లో బెల్ట్ సాధించారని తెలిపారు. వివిధబెల్టులు సాధించిన విద్యార్థులకు కస్తూరిబాపాఠశాల ప్రిన్సిపల్ శ్వేత చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రెంజుకి గ్రాండ్ మాస్టర్ కె.నాగేష్, రెంజుకి చోటోఖాన్ కరాటే మాస్టర్ రాష్ట్ర అధ్యక్షులు జి.అశోక్, కరాటేమాస్టర్స్ నాగేందర్, మెదక్ ప్రసన్న, రుస్తుంపేట్ చందన, సిద్దు, యశ్వంత్ పాల్గొన్నారు.

## నాణ్యమైన భోజనం అందించాలి

**-మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజుయాదవ్**

**నర్సాపూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
నర్సాపూర్‌లోని బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని నర్సాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ మాచునూరి లక్ష్మీరాజుయాదవ్ అన్నారు. సోమవారంనర్సాపూర్ పట్టణంలోని బాలికల వసతి గృహాన్ని మున్సిపల్ చైర్మన్ లక్ష్మిరాజుయాదవ్ సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో ఆమెవెంట కౌన్సిలర్ సుధీర్‌గౌడ్ ఉన్నారు.

## విద్యాసదస్సును విజయవంతం చేయాలి: యాదగిరి

**కొల్చారం ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 30న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర విద్యాసదస్సును జిల్లాలోని ఉపాధ్యాయులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యాదగిరి కాంగోటి పిలుపునిచ్చారు. ఈసమావేశంలో ప్రధాన కార్యదర్శి వెంకట్‌రామ్‌రెడ్డి పట్లోరి పాల్గొన్నారు. ఈసందర్భంగా సదస్సుకు సంబంధించిన గోడపత్రికను జిల్లా అధ్యక్షులు యాదగిరి, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రామ్‌రెడ్డి ఆవిష్కరించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా పాఠశాల విద్యాసంచాలకులు డాక్టర్ నవీన్ నికోలస్, గౌరవఅతిథిగా ప్రొఫెసర్ ఎం.కోదండరాం హాజరుకానున్నారు. నూతన జాతీయ విద్యావిధానం-రాజ్యాంగ విలువలు అనే అంశంపై ప్రొఫెసర్ హరగోపాల్, తెలంగాణలో అసమానవిద్య-విద్యారంగసంక్షోభం అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చింతకింది కాశీం, పశ్చిమ ఆసియా యుద్ధం-ప్రపంచ రాజకీయాలు అనే అంశంపై ఆంధ్రజ్యోతి పూర్వసంపాదకులు కె.శ్రీనివాస్ ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సంగయ్య, హీరాలాల్, రాజేంద్రప్రసాద్, నజీరుద్దీన్, అల్వాల రమేష్, సంగీత, ఉపాధ్యాయ దర్శిని మాజీ సంపాదకులు శశిధర్‌రెడ్డి, జిల్లాకమిటీ సభ్యులు సాయిబాబా, నసీరుద్దీన్, మంగ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా పిఎసిఎస్ నూతన కార్యవర్గం

**పెద్దశంకరంపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
పిఎసిఎస్ మెదక్ జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నర్సాపూర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో జిల్లా పిఎసిఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పిఎసిఎస్ మెదక్‌జిల్లా అధ్యక్షులుగా రవీందర్, ఉపాధ్యక్షులుగా మధు, కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా నవీన్, ట్రెజరర్‌గా అమీర్ అలీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నవీన్, జాయింట్ సెక్రటరీగా సాయికిరణ్, సభ్యులుగా వెంకటస్వామి, దినేష్, రమేష్, శ్రీనివాస్, స్వామి, సిద్ధిరాంరెడ్డి, శోభారాణి, వేణుగోపాల్‌లను ఎన్నుకున్నారు.

## వ్యాపారపరంగా మరింత అభివృద్ధి జరగాలి

**-మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్యానాగరాజు**

**రామాయంపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
రామాయంపేట పట్టణం వ్యాపారపరంగా మరింత అభివృద్ధి జరగాలని రామాయంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్యానాగరాజు అన్నారు. సోమవారం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన రిషి ఫిల్లింగ్ స్టేషన్‌ను స్థానిక తహసీల్దార్ రజనీకుమారితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నవనీత, కౌన్సిలర్లు, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

**-ఆంజనేయులుగౌడ్, సుహాసినిరెడ్డి**


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు, సుహాసినిరెడ్డి

**నర్సాపూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
మహిళారిజర్వేషన్ల బిల్లుపై కేంద్రంలోని బిజెపిప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోడీకి చిత్తశుద్ధి లేదని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మెదక్‌జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్పర్సన్ సుహాసినిరెడ్డిలు అన్నారు. సోమవారం నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గంగాధర్, శివంపేట్ మండల అధ్యక్షులు సుదర్శన్‌గౌడ్, సర్పంచి రవీందర్‌యాదవ్, దాడిగా నరేష్, మహేష్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొనారు.

## తంగడపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం


ఇందిరమ్మ ఇంటికి గృహప్రవేశం చేస్తున్న నిర్మలాజగ్గారెడ్డి

**సదాశివపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
మండలంలోని తంగడపల్లి గ్రామంలో నిర్మించిన రెండు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి డిజిఐసి చైర్మన్ శ్రీమతి నిర్మలాజయప్రకాశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గృహప్రవేశాలను నిర్వహించారు. ఈసందర్భంగా సిడిసి చైర్మన్ గడిల రామ్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాష్ట్ర సిద్ధన్న, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మనుపల్లి సత్యనారాయణ, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్, కంబాలపల్లి ఆంజనేయులు పాల్గొన్నారు. అలాగే గ్రామసర్పంచి శేఖర్, ఉపసర్పంచి, వార్డు సభ్యులు, మాజీ సర్పంచి సంగమేష్, గ్రామ నాయకులు, లబ్ధిదారుల కుటుంబసభ్యులు కార్యక్రమంలో పాల్గొని గృహప్రవేశాన్ని ఆనందంగా జరుపుకున్నారు.

## గుమ్మడిదలలో ఇంటిపన్నులకు రాయితీ

**-ఏప్రిల్ 30 వరకు అవకాశం**

**గుమ్మడిదల, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి(ఇంటిపన్ను)లను ముందస్తుగా చెల్లించేవారికి 5శాతం రాయితీ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దశరథం తెలిపారు. ఈ ప్రత్యేక రాయితీ 2026 ఏప్రిల్ 1 నుండి ఏప్రిల్ 30 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. పౌరులు తమ పన్నులను పురపాలక కార్యాలయంలో లేదా ఆన్లైన్ ద్వారా సులభంగా చెల్లించవచ్చు. ప్రభుత్వం అందించిన అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా చెల్లింపు సౌకర్యం ఉంది. పన్నులను సకాలంలో చెల్లించడం ద్వారా పట్టణ అభివృద్ధికి ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని కమిషనర్ కోరారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## మల్లన్న జాతరలో ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్‌చెరు, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
ఇస్నాపూర్ మున్సిపల్ కేంద్రంలోగల మల్లన్నస్వామి దేవాలయంలో సోమవారం నిర్వహించిన శ్రీభ్రమరాంబ సమేతంగా మల్లికార్జునస్వామి కళ్యాణ మహోత్సవం, శ్రీకామరతి సమేత బీరప్పస్వామి కళ్యాణం, జాతరలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కురుమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జిఎంఆర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సదాశివపేటలో కోఆప్షన్ సభ్యుల నామినేషన్లు


నామినేషన్లు దాఖలు చేస్తున్న సభ్యులు

**సదాశివపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
సదాశివపేట మున్సిపాలిటీలో కోఆప్షన్ సభ్యుల పదవులకు అభ్యర్థులు సోమవారం నామినేషన్లు దాఖలు చేశారు. టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌పార్టీ తరపున నామినేషన్లు సమర్పించబడినవి. నామినేషన్లు దాఖలుచేసిన అభ్యర్థులు మునిపల్లి సత్యనారాయణ (మున్సిపల్ మాజీచైర్మన్), మహమ్మద్ రహమత్(తండ్రి: అబ్దుల్ అజీజ్), సుల్తానా (భర్త: వాజీద్, ఖాసీంనగర్), ఎగమామిడి అనంతమ్మ (భర్త: చంద్రయ్య, రవీంద్రనగర్) ఉన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మున్సిపల్ అభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని అభ్యర్థులను అభినందించారు. పట్టణ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంలో కోఆప్షన్ సభ్యులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్పర్సన్ రాంరెడ్డి, పట్టణ చైర్పర్సన్ మునిపల్లి అంజమ్మ, వైస్ చైర్పర్సన్ రేణుక చిరు, పట్టణ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న ఆవుల రాజిరెడ్డి

**వెల్దుర్తి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
మండలంలోని నెల్లూరు గ్రామంలో సోమవారం నాడు. మొదటి దశలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న అధికారులు గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి నర్సాపూర్ కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి పాల్గొని. ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచి రంగారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంత ఇంటి కల సాకారమే ప్రభుత్వ లక్ష్యం

**-నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి**

**పెద్దశంకరంపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
పేద ప్రజల సొంత ఇంటి కల సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. సోమవారం మండలపరిధిలోని మల్కాపూర్, లక్ష్మాపూర్ గ్రామాలలో లబ్ధిదారులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ళ గృహప్రవేశ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి లబ్ధిదారులతో కలిసి కొత్త ఇళ్లలోకి అడుగుపెట్టి వారి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ పేదప్రజలు ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ళ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తుందని తెలిపారు. సొంత ఇంటిలోకి అడుగుపెడుతున్న మహిళా లబ్ధిదారులందరికీ ఈసందర్భంగా ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ మాణిక్ చౌహాన్, ఎంపిడివో క్రాంతికుమార్, డిఈ ప్రసన్న, ఏఈ కౌశిక్, సర్పంచులు రాజేశ్వరి సుభాష్, శ్రీనివాస్, రవీందర్, రాజునాయక్, నాయకులు నారాగౌడ్, దాచ సంగమేశ్వర్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు పెరుమాళ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## లైటింగ్ సమస్య పరిష్కరిస్తా

**-ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి**

**పటాన్‌చెరు, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని పోచారం సన్‌రైస్ విల్లాకు వెళ్లే దారిలో లైటింగ్ సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. సోమవారం సన్‌రైస్ విల్లాలో వినాయక విగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ గణనాథుడి కృపతో అందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ప్రార్థించినట్లు తెలిపారు. కాలనీవాసులు లైటింగ్ ఏర్పాటుచేయాలని కోరగా, మున్సిపాలిటీ కమిషనర్‌తో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో బిజెపి సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, నాయకులు హర్ష, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

# విద్యా సదస్సును విజయవంతం చేయాలి

## టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్



విద్యా సదస్సు గోడపత్రికలు, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 20 (ప్రభాతవార్త):** టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర విద్యా సదస్సుకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టిపిటిఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ పిలుపునిచ్చారు. గజ్వేల్‌లోని సమీకృత కార్యాలయాల సముదాయంలో రాష్ట్ర విద్యా సదస్సు గోడపత్రికలు, కరపత్రాలను జిల్లా ఉపాధ్యక్షుడు పాపిరెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, విద్యాసాగర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ పరిస్థితులు, విద్యారంగ అభ్యున్నతి, అందరికి సమానమైన విద్యను అందించే కామన్ స్కూల్ సిస్టం, ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణం తదితర అంశాలు చర్చించడానికి రాష్ట్ర విద్యా సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర విద్యా సదస్సుకు ముఖ్య అతిథిగా పాఠశాల విద్యాశాఖ సంచాలకులు డాక్టర్ నవీన్ నికోలస్, గౌరవ అతిథిగా తెలంగాణ ఉద్యమ జేఏసి నాయకులు ప్రొఫెసర్ కోదండరాం హాజరవుతున్నట్లు తెలిపారు. సదస్సులో నూతన జాతీయ విద్యా విధానం రాజ్యాంగ విలువలు అనే అంశంపై ఏఐఎఫ్ఆర్‌టిఈ జాతీయ అధ్యక్ష వర్గ సభ్యులు ప్రొఫెసర్ హరగోపాల్, తెలంగాణలో అసమాన విద్య విద్యారంగంలో సంక్షేమంపై ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చింతగింది కాశీం, పశ్చిమాసియా యుద్ధం ప్రపంచ రాజకీయాలు అనే అంశంపై ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు కె.శ్రీనివాస్ ప్రసంగించనున్నట్లు తెలిపారు. ఈ విద్యా సదస్సుకు ఉపాధ్యాయులు, విద్యాభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ నాయకులు దయానంద్, శ్రీనివాస్‌గౌడ్, అర్జున్, శ్రీనివాస్, ఆకుల శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, మహిళా ఉపాధ్యాయులు స్వరూప, జగదాంబ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కుకునూరుపల్లిలో బసవేశ్వర జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

## బసవేశ్వరుడికి ఘన నివాళులు

**కొండపాక, ఏప్రిల్ 20, ప్రభాతవార్త :** బసవేశ్వరుని జీవితాన్ని అదర్శంగా తీసుకోవాలని లింగయత్ సిద్దిపేట జిల్లా గౌరవ అధ్యక్షుడు, సర్పంచుల ఫోరం కుకునూరుపల్లి మండల అధ్యక్షుడు అకుల భద్రప్ప అన్నారు. సోమవారం కుకునూరుపల్లి మండల పరిధిలోని ఆయన అధ్వర్యంలో తిప్పారం, కుకునూరుపల్లిలో బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లింగాయత్ మండల అధ్యక్షుడు కోరే అంజనేయులు, తిప్పారం లింగాయత్ అధ్యక్షుడు మల్లెశం, కుకునూరుపల్లి సర్పంచ్ మల్లం కనకవ్వఐలయ్య, ఉపసర్పంచ్ దొంతి సత్తయ్య, మాజీ సర్పంచ్ కాచం నవీన్, నాయకులు ఇండ్ల కనకయ్య, నరేందర్, అమరేందర్, వార్డు సభ్యులు, మండలంలోని వివిధ గ్రామాల లింగాయత్ నాయకులు, కుకునూరుపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**గజ్వేల్‌లో...**



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చందన రవీందర్

**గజ్వేల్, ఏప్రిల్ 20 (ప్రభాతవార్త):** వీరశైవ లింగాయత్ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం గజ్వేల్ పట్టణంలో బసవేశ్వర స్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్ మాట్లాడుతూ 12వ శతాబ్దంలోనే కులమతాలకు అతీతంగా, సమానత్వాన్ని బోధించారని, వారి బోధనలు అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు, కౌన్సిలర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్లు ఎన్‌సి.రాజమౌళి, గాడిపల్లి భాస్కర్, డాక్టర్ నరేష్‌బాబు, డాక్టర్ కుమారస్వామి, బాలకుమార్ సుంకరి, వీరశైవ లింగాయత్ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**మునిగడపలో...**



మునిగడపలో బసవేశ్వరుని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**జగదేవ్‌పూర్, ఏప్రిల్ 20 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని మునిగడప గ్రామంలో సోమవారం బసవేశ్వరుని 893వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముచ్చపతి బాలయ్య మాట్లాడుతూ కులమతాల బేధాల నిర్మూలనకు కృషి చేసిన గొప్ప మహనీయుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపసర్పంచ్ కిషన్ యాదవ్, మాజీ సర్పంచ్ బాల్‌లక్ష్మి ఐలయ్య, రవిగౌడ్, వార్డు సభ్యులు గుర్రం శ్రీధర్, లింగప్ప, కొత్తపల్లి విజయ్‌కుమార్, నాగరాజు, భద్రప్ప, నరేష్, శరణప్ప, సంగప్ప, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

**అల్లాదుర్గం మండలంలో...**



అల్లాదుర్గంలో బసవ జయంతిని జరుపుకుంటున్న భక్తులు

**అల్లాదుర్గం, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** మండలంలో విశ్వగురువు మహాత్మా బసవేశ్వరుడి 893వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని బసవేశ్వరుడి విగ్రహాలకు, చిత్రపటాలకు పూజలు నిర్వహించి జయంతి వేడుకలను నేత్ర పర్వంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని వెంకట్రావ్‌పేటల సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అల్లాదుర్గంలో బసవేశ్వరుడి జయంతి వేడుకలు యూత్ నాయకుల ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో యువజన సంఘాల నాయకులు బత్తుల సురేష్, బాగిలి సంగమేశ్వర్, జంగం శ్రీకాంత్, బసప్ప, కుంబారి వీరేశం, బసవరాజ్, ఔసలి మురళి, బాగిలి రమేష్, నాగిశెట్టి, సిందు పాల్గొన్నారు.

## మహాత్మా బసవేశ్వరుడి బోధనలు స్ఫూర్తిదాయకం

### -ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



బీరంగూడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**రామచంద్రాపురం, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** సమాజంలో అంతరానితనం, వివక్షతకు వ్యతిరేకతకు పోరాడిని మహోన్నత వ్యక్తి విశ్వగురువు మహాత్మా బసవేశ్వరుడని, బసవేశ్వరుడి బోధనలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బసవేశ్వరుడి 893వ జయంతి ఉత్సవాలను రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని బీరంగూడ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి సమాజోద్ధణకు బసవన్న చేసిన త్యాగాలను, సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజం నియోజకవర్గ అధ్యక్షులు జగదీష్, సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.

## అనాథ పిల్లలకు చేయూత

**జగదేవ్‌పూర్, ఏప్రిల్ 20 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన కొండాపూర్ ఉమారాణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా తల్లిని కోల్పోయిన ముగ్గురు చిన్నారులు ఉన్నారు. వారి తండ్రి ఉన్నప్పటికీ ఆయన ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో పిల్లలు అనాథలుగా ఆశ్రయాన్ని కోరుతున్నారని గమనించి గ్రామానికి చెందిన చిలుకూరి మహేందర్‌రెడ్డి వారి కుటుంబానికి నిత్యావసర సరుకులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు తనకు తోచిన సహాయాన్ని అందించి అండగా ఉంటానని మనోధైర్యం కల్పించారు.

## జనగణన శిక్షణ తరగతులను పరిశీలించిన డిపిఓ

**అల్లాదుర్గం, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న జనగణన 2027లో భాగంగా రెండు రోజుల పాటు కొనసాగనున్న శిక్షణ తరగతులను సోమవారం డిపిఓ యాదయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ శిక్షణలో ప్రతి అంశాన్ని అవగాహన కల్పించుకోవాలని సూపర్‌వైజర్లకు సూచించారు. ప్రశ్నలకు సమాదానం రూపంలో నివృతి చేయాలన్నారు. కార్యక్రమంలో డిఎల్‌పిఓ సురేష్‌బాబు, తహసీల్దార్ మల్లయ్య తదితరులు ఉన్నారు.

## వసతి గృహాన్ని తహసీల్దార్ ఆకస్మిక తనిఖీ

**బెజ్జంకి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త :** సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తహసీల్దార్ కళ్యాణపు శ్రీకాంత్ ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీలో విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులు నాణ్యతతో కూడిన భోజనం అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

### తహసీల్దార్ మాలతి

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** వసతిగృహంలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ మాలతి సూచించారు. సోమవారం చిన్నశంకరంపేటలోని ఎస్టీ వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని సూచించారు. వేసవి సెలవుల్లో మరుగుదొడ్లు, స్నానాల గదులకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. అలాగే ఎస్సీ వసతి గృహాన్ని ఎంపీడీవో దామోదర్, ఈవో ప్రదీప్‌లు పరిశీలించారు.

## వైభవంగా చౌడలమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

**కొండపాక, ఏప్రిల్ 20, ప్రభాతవార్త :** మండల పరిధిలోని దుద్దెడ గ్రామంలో సోమవారం చౌడలమ్మ అలయ కమిటీ, శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్వర్యంలో చౌడలమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మహిళలు మంగళహరతులతో అమ్మవారిని అహ్వానించి మొక్కులు చెల్లించుకున్నారు. యాదవ కులస్తులు, గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు, వేద పండితులచే ప్రత్యేక హోమం, కలశ పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ కృష్ణయాదవ సంఘం అధ్యక్షులు జక్కుల రాజు, చౌడలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు గుండెల్లి అంజనేయులు, పెద్ద గొల్ల కొమురయ్య, యాదవ కుల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు : ఎంపిడివో

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందించడాని ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీవో దామోదర్ అన్నారు. సోమవారం చిన్నశంకరంపేటలో రుద్రారంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవో ప్రదీప్, సర్పంచి సంతోష్, రాజిరెడ్డి, నవిన్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నశంకరంపేట ఎంపివోగా వినోద్

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట ఎంపీఓగా వినోద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వినోద్ నిజామాబాద్ జిల్లా ఇందల్వాయ్ నుండి బదలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన ఎంపీవో గిరిజారాణి కామారెడ్డి డిఆర్డీవోకు బదలిపై వెళ్లారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని, సమస్యలను వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీను మండల పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సత్కరించారు.

## బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** మండల పరిధి సూరారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు 50 మందికి పైగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. మెదక్, మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ ఖండువా కప్పారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాల అభివృద్ధి కార్యక్రమాలు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని ఆయన తెలిపారు.



హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నాయకులు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## మాలపల్లిలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త :** మండలంలోని మాలపల్లి గ్రామంలో సోమవారం సొసైటీ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ వెన్న స్వర్ణలతరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను వినియోగించుకుని వడ్లను కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని ఆమె సూచించారు. సెంటర్ నిర్వాహకుడు వెన్న శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, గ్రామ మాజీ సర్పంచ్‌లు, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

**గాంధీనగర్‌లో...**

మండలంలోని గాంధీనగర్ గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తోటపల్లి గ్రామ సర్పంచ్ బంక లక్ష్మిచందం, ఉప సర్పంచ్ శ్రీశైలం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొంగోని శ్రీనివాస్, హుస్నాబాద్ తహసీల్దార్ లక్ష్మారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. రైతులు తమ వడ్లను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, హమాలీలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**దాచారంలో...**

**బెజ్జంకి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త :** మండల పరిధిలోని దాచారం గ్రామంలో సోమవారం సర్పంచ్ బైర మానసరాజేందర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మానసరాజేందర్ మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లో అమ్ముకొని మద్దతు ధరను పొందాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టోకెన్ పద్దతిలో పారదర్శకంగా కొనుగోళ్లు చేయడం జరుగుతుందన్నారు. కారయనక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ చుకువేరు శ్రీనివాస్‌రెడ్డి, రైతు సంఘాల నాయకులు ముక్కిస రత్నాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ దీటి బాలనర్సు, వార్డు సభ్యులు, ఐకెపి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**ఫీడర్ ఛానల్ పనులు ప్రారంభం**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో దాచారం గ్రామ పరిధిలోని దయ్యాలకుంట ఫీడర్ ఛానల్ పూడికతీత, మరమ్మతు పనులను సర్పంచ్ బైర మానసరాజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మానస రాజేందర్ మాట్లాడుతూ వర్షపు నీరు, వరద నీరు సక్రమంగా చెరువులోకి చేరేలా ఆయకట్టు చివరివరకు సాగునీరు అందేలా ఉపాధి హామీ కూలీలతో ఫీడర్ ఛానల్‌లో పూడిక తీయించి గట్లు పటిష్టం చేసే పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనుల ద్వారా దయ్యాలకుంట పూర్తి స్థాయిలో నింపి ఆయకట్టుకు సాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. ఉపాధి హామీ పనుల్లో కూలీలకు ఎండ తీవ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. వడదెబ్బ తగలకుండ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తరుచూ నీళ్ల తాగుతూ పని చేయాలని కూలీలకు సూచించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడొద్దని టెక్నికల్ అసిస్టెంట్ పర్యవేక్షణలో నిబంధనల మేరకు పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దీటి బాలనర్సు, వార్డు సభ్యులు, టిఏ, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## జనగణన పారదర్శకంగా చేపట్టాలి

### ప్రత్యేక అధికారి జోజు

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** మండలంలో చేపట్టే జనగణను పారదర్శకంగా చేపట్టాలని ప్రత్యేక అధికారి జోజు తెలిపారు. సోమవారం చిన్నశంకరంపేటలో నిర్వహిస్తున్న జనగణన శిక్షణా శిబిరాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. జనగణన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదన్నారు. 33 ప్రశ్నలతో సమాచార సేకరణ జరుగుతుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు ఈ గణాంకాలు కీలకం అని అన్నారు. జనగణనలో అందరూ భాగస్వాములు కావాలని తెలిపారు. డేటా సేకరణలో ప్రతి ఇంటిని సందర్శించి కచ్చితమైన సమాచారాన్ని సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాలతి ఉన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

## ఎఎంసి చైర్మన్ యాదగిరి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎఎంసి చైర్మన్ యాదగిరి

**నంగునూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఎఎంసి చైర్మన్ దేవులపల్లి యాదగిరి అన్నారు. మండల పరిధిలోని పాలమాకుల, ముండ్రాయి, రాజగోపాల్‌పేట, అంక్షాపూర్, గట్లమల్యాల, రాంపూర్ గ్రామాలలో సోమవారం ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎపిఎం శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు దళారుల బారిన పడకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం రైతులకు మద్దతుధర అందించడానికే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2389, కామన్ గ్రేడ్‌కు రూ.2369 మద్దతు ధర ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ సాదుల పవన్, డైరెక్టర్లు ఐలయ్య, ఇమ్రాన్, రంగు రజిత, రంగారెడ్డి, ఏవో గీతా, ఎఈవో చైతన్య, సీసీలు శ్రీనివాస్, లింగం, మల్లేశం, ప్రేమలత, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఓజాల్, జిడ్డి చామంతి. పద్మ, చేర్యాల వాణి, వివోఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**చిన్నకోడూరులో...**

మండల పరిధిలోని మేడిపల్లి, చౌడారం, చెలకలపల్లి, ఎల్లమ్మజాలు గ్రామాల్లో అల్లీపూర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎఎంసి చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యమన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధరను పొందాలన్నారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ బుస్సా రాజశేఖర్, సీఈవో బాలరాజు, సర్పంచ్‌లు వాసు దేవాచారి, బొడిగే సదానందంగౌడ్, నాగార్జునరెడ్డి, ఎఎంసి డైరెక్టర్లు వినోద్, భూపతిరెడ్డి, మాజీ సర్పంచ్ పెండ్యాల బాలయ్య, వార్డు సభ్యులు, పాల్గొన్నారు.



పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## వైభవంగా పెద్దిరాజు పెద్దమ్మల కళ్యాణం

**రాయపోల్, ఏప్రిల్ 20 (ప్రభాతవార్త):** ముదిరాజుల సంఘం ఆధ్వర్యంలో రెండు రోజుల నుండి నిర్వహిస్తున్న పెద్దమ్మ తల్లి తృతీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ముగిసాయి. సోమవారం పెద్దిరాజు పెద్దమ్మల కళ్యాణం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ శ్యామల మల్లేశం, ఎస్ఐ మానసలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో కలిసి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి కృపతో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు. వేడుకల్లో ముదిరాజ్ సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



చాట్లపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

**జగదేవ్‌పూర్, ఏప్రిల్ 20 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామానికి చెందిన ఎగుర్ల రామవ్వ కొండయ్యలకు ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో సోమవారం కాంగ్రెస్ నాయకులు, మాజీ వార్డు సభ్యులు బరిగె నర్సింలు ముదిరాజ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎన్.జనార్ధన్‌రెడ్డి భూమిపూజ నిర్వహించి ముగ్గు పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల ఇంటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం ద్వారా రూ.5 లక్షల రూపాయలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుందని, దీంతో పేదలకు ఆర్థిక భరోసా కలిగి వారి కల సాకారం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపిటిసి మాసూరి కావ్య దర్గయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బీరయ్య, కొండపోచమ్మ ఆలయ డైరెక్టర్ గడ్డం రాజు, మాజీ వార్డు సభ్యులు న్యాలమడుగు మల్లారెడ్డి, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎగుర్ల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## నవవధువుకు పుస్తెలు, మెట్టెలు అందజేత

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 20 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 2వ వార్డుకు చెందిన కూరాకుల దుర్గయ్య, రేణుక దంపతుల కుమార్తె ప్రియ వివాహం సందర్భంగా స్థానిక కౌన్సిలర్ గోలి మమత సంతోష్ సోమవారం పుస్తెలు, మెట్టెలతో పాటు చీరను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఖాజా, కూరాకుల దుర్గయ్య రేణుక కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబీకులను పరామర్శించిన మాజీ ఎంఎల్‌సి

**కొమురవెల్లి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త :** మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నేత ముత్యం నర్సింహాలు తండ్రి బాలమల్లు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబీకులను మాజీ ఎంఎల్‌సి రాజలింగం సోమవారం పరామర్శించారు. ఆయన వెంట ముత్యం ఆంజనేయులు, ముత్యం యాదగిరి, వడ్లకొండ ఆంజనేయులు, ముత్యం మహేష్ ఉన్నారు.

## మీర్జాపూర్‌లో చలివేంద్రం ఏర్పాటు

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త :** మండలంలోని మీర్జాపూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ వి.సంపత్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో ప్రజలు, బాటసారులు దాహార్తి తీర్చుకునేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలోకి వచ్చే ప్రతి ఒక్కరికి చల్లని తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్వరన్ కుమార్, పాలకవర్గ సభ్యులు పి. రాజు, శ్రీశైలం, జోష్ణ, వి. కార్తీక్, గ్రామ కార్యదర్శి వి. ప్రసాద్, గ్రామ ప్రజలు రాములు, కె. సంపత్, టి. మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్‌కు వాటర్ ఫిల్టర్ అందజేత

**చౌటకూరు, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయానికి సర్పంచ్ పార్కల రాంరెడ్డి సోమవారం వాటర్ ఫిల్టర్, ఎయిరకూలర్‌లను అందచేశారు. వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని కార్యాలయానికి వచ్చే ప్రజలు దప్పికతో అవస్థలు పడకుండా ఉండేందుకు వాటర్‌ఫిల్టర్ ఉపయోగపడుతుందన్న ఉద్దేశంతో వాటర్ ఫిల్టర్‌ను అందచేశామని సర్పంచ్ రాంరెడ్డి పేర్కొన్నారు. కార్యాలయానికి వాటర్ ఫిల్టర్, ఎయిర్‌కూలర్ అందచేసిన సర్పంచ్ పార్కల రాంరెడ్డిని ఎంపిడిఓ కె శంకర్, సిబ్బంది శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిఓ సువర్ణ, జూనియర్ సహాయకులు మహేశ్వర్‌రెడ్డి, శైలజ, పంచాయతీ కార్యదర్శి సందీప్‌గౌడ్, సిబ్బంది యాదగిరి, వహీద్ పాల్గొన్నారు.

## మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

**బెజ్జంకి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త :** బెజ్జంకి గ్రామ పంచాయతీ పరిధిలోని మదిర గ్రామమైన పాపయ్యపల్లిలో వార్డు సభ్యులు వంగల మాధవి నరేష్ ఆధ్వర్యంలో సోమవారం ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వేసవికాలం దృష్ట్యా కూలీలకు చల్లదనం కోసం పంపిణి చేసినట్లు వార్డు సభ్యులు తెలిపారు. ఉపాధి హామీ పనులు జరిగే రోజుల్లో ప్రతి రోజు చల్లని తాగునీటిని అందిస్తామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న, ఉప సర్పంచ్ దూమాల మహేష్, వార్డు సభ్యులు బొనగం రమేష్, పొట్లపల్లి శివకృష్ణ, తిప్పరపు మహేష్, లోనే నర్సింగరావు, లింగాల వెంకటేష్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## బిటి రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభం

**మునిపల్లి, ఏప్రిల్ 20 (ప్రభాతవార్త):** మండలంలోని చిన్నచెల్మెడలో రూ.1 కోటి 65 లక్షలతో బిటి రోడ్ నిర్మాణం పనులను సోమవారం మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం చిన్న చెల్మెడ నుండి ఖమ్మంపల్లి వరకు బీటి రోడ్ పనులకు మంత్రి దామోదర రాజనర్సింహ కృషితో 1కోటి 65లక్షల నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంరెడ్డి, మండల అధ్యక్షులు సతీష్‌కుమార్, సర్పంచ్ రుద్రగాయత్రి, నాయకులు టి.సంగన్న, మక్సూద్‌పటేల్, రసూల్ పటేల్, గుడ్డు పటేల్, మాజీ ఎంపీటీసీ పాండు, ఖమ్మంపల్లి సర్పంచు గుజ్జరి పాండు, గోపులారం సర్పంచ్ మల్లేశం, రేగోటి నరేష్ కుమార్, మునిపల్లి వార్డ్ సభ్యులు ప్రభుగౌడ్, మండల నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



బిటి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎఎంసి చైర్మన్ సుధాకర్‌రెడ్డి

# ప్రజావాణికి అధికారుల గైర్హాజరు

## -డుమ్మాకొట్టిన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు



ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

**చౌటకూరు, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
గ్రామల్లోని సమస్యల పరిష్కారానికి మండల కేంద్రమైన రెవిన్యూ కార్యాలయ ఆవరణలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి పలుశాఖల అధికారులు తరచుగా డుమ్మాకొడుతున్నారు.

సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రెవిన్యూ, పశుసంవర్ధకశాఖ, నీటి పారుదల, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది మాత్రమే హాజరవగా 12 గంటలకు మహిళా శిశు సంక్షేమశాఖ సూపర్‌వైజర్ అమృతవాణి హాజరయ్యారు. మిగతా శాఖల అధికారులు, సిబ్బంది కార్యక్రమానికి డుమ్మాకొట్టారు. అన్నిశాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొనకపోతుండటంతో ప్రజలు సైతం తమ సమస్యలను పరిష్కరించే అధికారులే కార్యక్రమానికి రావడం లేదని, ఇక ఫిర్యాదులు చేస్తే ప్రయోజనం ఏమిటని ప్రజలు సైతం సమస్యలను పరిష్కరించాలంటూ ఫిర్యాదులు చేయడం లేదని ప్రచారం సాగుతోంది. అన్నిశాఖల అధికారులు ప్రజావాణికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించినా ప్రయోజనం లేకుండా పోతోంది. అధికారులు ప్రజావాణికి డుమ్మాకొడుతున్న విషయాన్ని ప్రభాతవార్త తహసీల్దార్ నామల కిష్టయ్య దృష్టికి తీసుకుపోగా గైర్హాజరు అయిన అధికారులపై కలెక్టర్‌కు నివేదిక అందచేయనున్నట్లు తహసీల్దార్ నామల కిష్టయ్య వివరణ ఇచ్చారు.

## వసతిగృహాన్ని సందర్శించిన ఎంఈఓ


వసతి గృహాన్ని సందర్శిస్తున్న ఎంఈఓ నాగారం శ్రీనివాస్

**సిర్గాపూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక కారర్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని ఎస్‌సి బాలుర వసతిగృహాన్ని మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ సందర్శించారు. వసతిగృహంలోని రికార్డులను ఎంఈఓ పరిశీలించి వసతిగృహం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వసతిగృహం వార్డెన్‌కు సూచించారు.

**కెజిబివిని సందర్శించిన ఎంఈఓ...**
ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని కెజిబివి పాఠశాలకు మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ సందర్శించారు. పాఠశాలలోని వంటశాలను, తరగతి గదులను, మరుగుదొడ్లను, పరిసరాలు పరిశీలించారు. వసతిగృహంలో కొనసాగుతున్న మరమ్మతు పనులపై ఇంజీరింగ్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ వెంట ఇంచార్జి ఎస్ఓ మహేశ్వరి, మానెప్ప, ఈఇ, సిఆర్‌టి, ఓంనాథ్, రికార్డు సహాయకులు ఉన్నారు.

## రైతు భరోసా కార్యక్రమం వీక్షణ


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమాన్ని వీక్షిస్తున్న దృశ్యం

**నర్సాపూర్ రూరల్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండలం లింగాపూర్ ఆవంచ రైతు వేదికల్లో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమాన్ని అధికారులు, రైతులు కలిసి వీక్షించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా రైతుభరోసా నిధుల విడుదల కార్యక్రమం ప్రత్యక్షప్రసారం చేయబడింది. కార్యక్రమంలో నర్సాపూర్ వ్యవసాయసంచాలకులు సంధ్యారాణి, మండల వ్యవసాయ అధికారిణి దీపిక, సర్పంచులు బోర్లపు రాజకళ శ్రీనివాస్‌గుప్తా, బుజ్జి, వ్యవసాయవిస్తరణ అధికారులు దుర్గాప్రసాద్, రుతు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాలకు చెందిన రైతులు కూడా హాజరై కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు. రైతుభరోసా నిధుల విడుదలతో రైతులకు ఆర్థికంగా మద్దతు లభిస్తుందని అధికారులు తెలిపారు.

## పెద్దాపూర్ సర్పంచి కాంగ్రెస్‌లో చేరిక


మనిషాబాలరాజుగౌడ్ కాంగ్రెసులోకి చేరుతున్న దృశ్యం

**సదాశివపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
పెద్దాపూర్ గ్రామ సర్పంచి మనిషాబాలరాజుగౌడ్ టిజిఐఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని అధికార పార్టీలో చేరారు. కార్యక్రమంలో సిడిసి చైర్మన్ రామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సిద్దన్న పటేల్, సర్పంచుల ఫోరం సదాశివపేట అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్ సూచన మేరకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తోపాజీ అనంతకిషన్, సూరారం సర్పంచి ముగ్దుమ్‌పటేల్, కంబాలపల్లి సర్పంచి భారతమ్మ బాబు పాల్గొన్నారు. అలాగే వార్డుసభ్యులు పత్తి అనసూయ, బండరాజు, పడకంటి శ్రీకాంత్‌తోపాటు గ్రామపెద్దలు ఆంజనేయులుగౌడ్, నరహరి, రంగని శివకుమార్, రంగని కిరణ్‌గౌడ్, చక్రపాణి, నల్ల రమేష్, వడ్ల నిరంజన్, అరుణ్, ఎండి అశ్వక్, సల్మాన్, మక్సుద్, రవి, అఖిలేష్ గౌడ్, రాకేష్‌గౌడ్, సంతోష్, శ్రావణ్‌కుమార్, హరిప్రసాద్, మల్లేశం, సతీష్ కుమార్ తదితరులు కాంగ్రెస్‌పార్టీలో చేరినట్లు తెలిపారు.

## బాదల్‌గావ్‌లో బొంగొండేశ్వర విగ్రహావిష్కరణ

### -పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి


బొంగొండేశ్వర విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**మనూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని బాదల్‌గావ్‌లో సోమవారం బొంబుగొండేశ్వర విగ్రహావిష్కరణ మహోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి హాజరై బొంగొండేశ్వరుడి విగ్రహానికి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రజల్లో ఐక్యత పెరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కె.దిగంబర్‌రెడ్డి, గంపల సిద్దారెడ్డి, నర్సింలు, గ్రామస్థులు విజయ్‌కుమార్, ప్రభుగొండ, కాశీనాథ్, మల్లికార్జున్, కురుమసంఘం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసిన ఆర్‌ఐ


రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఆర్‌ఐ ప్రమోద్‌కుమార్

**చౌటకూరు, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన చౌటకూరులోని రేషన్ దుకాణాన్ని రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రమోద్‌కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. రేషన్‌బియ్యం పంపిణీలో జాప్యంచేస్తున్నారంటూ గ్రామస్థులు రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రమోద్‌కుమార్ కాశీ విశ్వేశ్వరాలయం వద్ద ఉన్న రేషన్ దుకానాన్ని తనిఖీచేసి మూడునెలలకు సంబంధించిన బియ్యం పంపిణీని పరిశీలించారు. ఈ నెల 30వ తేదీ వరకు వంద శాతం పంపిణీ పూర్తిచేయాలని డీలర్‌కు అధికారి సూచించారు. రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని ఆదేశించారు.

## గిరిజన విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

### -సర్పంచుల ఫోరమ్ జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణాగౌడ్


బాలికల గురుకులాన్ని సందర్శించిన చంద్రం కృష్ణాగౌడ్

**కౌడిపల్లి, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
గిరిజన మిని బాలికల గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సర్పంచుల ఫోరమ్ జిల్లా ఉపాధ్యక్షులు, మండల అధ్యక్షులు, స్థానిక సర్పంచి చంద్రం కృష్ణాగౌడ్ గురుకులం సిబ్బందికి సూచించారు. 99 రోజుల ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక సంక్షేమవారోత్సవాల్లో భాగంగా మొదటి రోజున సంక్షేమ పాఠశాలలు, వసతిగృహాల వంటగదులు, పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, ఆహారనాణ్యతపై అవగాహన కింద సోమవారం మండలకేంద్రంలోని గిరిజన మిని బాలికల గురుకుల వసతిగృహాన్ని సర్పంచుల ఫోరమ్ జిల్లా ఉపాధ్యక్షులు, స్థానిక సర్పంచి చంద్రం కృష్ణాగౌడ్ ఆకస్మికంగా తనిఖీచేశారు. కార్యక్రమంలో మిని గురుకులం ఇంచార్జి ప్రిన్సిపాల్ ఫణికుమార్‌తోపాటు సిబ్బంది మారోని, మాధవి, శోభారాణి, ప్రమీల, వైష్ణవి, సరోజ, లలిత, కవిత, శైలజ, మాధవి, వార్డుసభ్యులు దేవేందర్, రమేష్‌నాయక్, నాయకులు సత్యనారాయణగౌడ్, రాగుల భూమయ్యపటేల్, దర్జి రమేష్, మంగలి ఆశోక్‌నాయి, వీరేశంగౌడ్, చంద్రం కిషోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కానుకుంటలో అడ్వెంటా కంపెనీ సేవాకార్యక్రమాలు

**గుమ్మడిదల, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
గుమ్మడిదలమండలం కానుకుంట గ్రామంలోని జిల్లాపరిషత్ హైస్కూల్‌లో అడ్వెంటా కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం సేవా కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ ప్రథమపౌరుడు, సర్పంచి ఇప్ప పెంటారెడ్డి ఆధ్వర్యంలో కంపెనీ ప్రతినిధులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత దంతపరీక్షలు నిర్వహించి, స్కూల్ బ్యాగులు ఇతర అవసరమైన విద్యాసామగ్రిని పంపిణీచేశారు. పాఠశాల భవనానికి నూతన రంగులను వేయించారు. కార్యక్రమంలో భాగంగా రాబోయే విద్యా సంవత్సరంలో పాఠశాల పరిసరాల్లో సిసికెమెరాలు ఏర్పాటుచేసి, విద్యాభివృద్ధికి తమవంతు సహకారం కొనసాగిస్తామని అడ్వెంటా కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అడ్వెంటా కంపెనీ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని, గ్రామ ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారని సర్పంచి ఇప్ప పెంటారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నల్లమట్టి తవ్వకాలను నిలిపివేయాలి..

### -ప్రజావాణిలో గ్రామస్థుల ఫిర్యాదు


ప్రజావాణిలో ఫిర్యాదుచేస్తున్న హత్నూర గ్రామస్థులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన హత్నూర అల్వచెరువులో అక్రమపద్ధతిలో చేపట్టనున్నా తవ్వకాలను అరికట్టాలని హత్నూరగ్రామానికి చెందిన రైతులు, గ్రామస్థులు సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుచేశారు. రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా గ్రామసభలో చర్చించకుండా, గ్రామసభ నిర్వహించినట్లు తప్పుడు రికార్డులు సృష్టించి హత్నూర అల్వచెరువులో నల్లమట్టి తీయడానికి గ్రామపంచాయతీ నుంచి తీర్మానాలు ఇచ్చారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమపద్ధతిలో వచ్చిన తీర్మానాలను రద్దుచేసి మట్టి తవ్వకాలను నిలిపివేసి రైతుల ప్రయోజనాలను కాపాడాలని వారు వినతిపత్రంలో కోరారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

**హత్నూర, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
హత్నూర మండలం తెల్లరాళ్లతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థినీవిద్యార్థులకు మెడ్వాన్ స్వచ్ఛందసంస్థ ఎడ్యుకేషన్ కిట్స్, అలాగే స్పోర్ట్స్‌మెటీరియల్, విద్యాసామగ్రిని ఉచితంగా అందజేసింది. కార్యక్రమంలో సర్పంచి, ఉపసర్పంచి, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, వార్డు సభ్యులు, గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఏడువారాల జాతరకు పోచమ్మ ఆలయం ముస్తాబు


బోరంచలో నల్ల పోచమ్మ ఆలయం దృశ్యం

**మనూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని బోరంచలో కొలువుండి భక్తులచే నిత్యపూజలందుకుంటున్న శ్రీనల్లపోచమ్మ ఆలయ ఏడువారాల జాతరకు ఆలయం ముస్తాబయింది. ఆలయంలో ప్రతి సంవత్సరం అక్షయతృతీయ తర్వాత వచ్చే గురువారం నుంచి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 22న ఆలయంలో ప్రథమపూజలందుకునే వినాయకుడి పూజ, ధ్వజారోహణం, 23న మొదటివారం జాతరను పురస్కరించుకుని నల్లపోచమ్మతల్లికి పంచామృత అభిషేకం, కుంకుమార్చన, విశేషపూజలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఈఓ శివరుద్రప్ప తెలిపారు. ఏప్రిల్ 30న 2వ వారం, మే 7న మూడవ వారం, మే 14న నాలుగవ వారం, మే 21న ఐదవ వారం, మే 28న ఆరో వారం, జూన్ 4న ఏడవ వారం ఉత్సవాలు నేత్రపర్వంగా నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకునేందుకు ఎస్ఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేస్తామన్నారు.

## వరి కొనుగోలుకేంద్రాలు ప్రారంభం

### -ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి


కొనుగోలు కేంద్రానికి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**కొల్చారం, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
మెదక్ జిల్లా కొల్చారం మండలంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సుడిగాలి పర్యటన నిర్వహించారు. మండలంలోని వరిగుంతం, రంగంపేట, పైతర గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాలను ఆమె ప్రారంభించారు. సంగాయిపేటలో మంజీరా వ్యవసాయ ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలుకేంద్రాన్ని కూడా ప్రారంభించారు. పైతర గ్రామంలో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ నిర్వహించగా, కోనాపూర్‌లో నూతనంగా మంజూరైన ఇళ్లకు భూమిపూజ చేసి, నిర్మాణం పూర్తయిన ఇళ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో మండలసర్పంచుల ఫోరం అధ్యక్షులు రవితేజరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, సర్పంచులు నిర్మలమల్లేశం, స్వర్ణలతవిజయ్‌కుమార్, దొడ్ల ఆంజనేయులు, కాంతమ్మప్రభాకర్, మోహన్, వినోద్‌నాయక్, మండలపార్టీ అధ్యక్షుడు గౌరీశంకర్, యూత్ అధ్యక్షుడు సంతోష్‌రావు, డిసిఎంఎస్ మాజీ వైస్‌చైర్మన్ ఆరిగె రమేష్‌కుమార్, మాజీ జడ్పిటిసి పాశం శ్రీనివాస్‌రెడ్డి, ముత్యంగారి సంతోష్‌కుమార్, నరేందర్‌రెడ్డి, ఉపసర్పంచులు చిట్కుల సురేష్, ఆరే రవీందర్, సుధాకర్‌లు పాల్గొన్నారు.

## టీచర్ పోస్టు భర్తీకి వినతి

### -అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు కోరుతూ ప్రజావాణిలో విజ్ఞప్తి


ప్రజావాణిలో వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యంల

**కొండాపూర్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
మండలకేంద్రం కొండాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్ బి.అశోక్‌కు టీచర్ పోస్టు భర్తీతో పాటు అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుచేయాలని గ్రామస్థులు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా గ్రామ ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు అజీమోద్దీన్ మాట్లాడుతూ అనంతసాగర్ గ్రామంలో నాలుగో అంగన్‌వాడీకేంద్రం లేకపోవడంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అందువల్ల కాలనీలోనే కొత్తగా నాలుగో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని కోరారు. అలాగే జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో అంగన్‌వాడీకేంద్రం ఏర్పాటుచేయాలని, అది సాధ్యం కాకపోతే కొత్త భవనం నిర్మించాలంటూ అధికారులకు విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో ఎంఐఎం వైస్ ప్రెసిడెంట్ మహమూద్, నాయకులు సమీర్, మహబూబ్ అలీ, వసీమ్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఇంటి కల సాకారం కాంగ్రెస్‌తోనే సాధ్యం

### -నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి

**హత్నూర ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే పేదల ఇంటి కల సాకారం అవుతుందని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం హత్నూర మండలం బడంపేట గ్రామంలో ఇందిరమ్మ పథకం ద్వారా నిర్మించిన ఇందిరమ్మ గృహాన్ని, ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులతోకలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామంలో ఏర్పాటుచేసిన విద్యుత్ లైట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచి జిన్నారం వెంకటేశం, ఉపసర్పంచి ఎండి కాజా, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ హకీమ్, మండలపార్టీ అధ్యక్షులు కరేకృష్ణ, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కాసాల సర్పంచి వెంకటేశం, వార్డుసభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## దుకాణాన్ని తనిఖీ చేసిన ఎక్సైజ్ అధికారులు

**చౌటకూరు, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని బొమ్మారెడ్డిగూడెం గిరిజనతండాలోని దుకాణాల్లో సోమవారం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తండాలోని కిరాణాకొట్టుల్లో మద్యం, నాటుసారా విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ ఎస్ఐ విజయ్‌కుమార్ తన సిబ్బందితో దుకాణాలను తనిఖీ చేశారు. గ్రామంతో బెల్టుషాపులు నిర్వహించకూడదని పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవతంగా తీర్మానం చేసిన విషయం పాఠకులకు విదితమే. గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మితే కఠినచర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్ఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు.

## మండలసమాఖ్య కార్యాలయంలో గ్రామసంఘాల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

**చిలిపిచెడ్, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
మండలంలోని వివిధగ్రామసంఘాల ఓబి పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో మండలంలోని అన్నిగ్రామాల్లో ఉన్న సెంట్రింగ్ వర్క్, సిమెంట్ ఇటుకలు చేస్తున్నవారు, కొత్తగా చేయాలనుకునేవారికి పిఎంఈజిపిపథకం ద్వారా 35శాతం సబ్సిడీకి రుణాలు ఇప్పించడానికి లబ్ధిదారులను గుర్తించాలని చెప్పడం జరిగింది. మండలంలో వివిధగ్రామాల్లో ఉన్న మహిళలు బ్యూటీషియన్ కోర్సు నేర్చుకోవడానికి ఆసక్తి ఉన్నవారిని, టైలరింగ్‌లో శిక్షణకు ఆసక్తి ఉన్నవారిని గుర్తించాలని చెప్పడం జరిగింది. అదేవిధంగా మండలంలో బ్యాంకు, స్త్రీనిధి బకాయిలు పూర్తిగాచెల్లించి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలని కోరడం జరిగింది. కార్యక్రమంలో ఎపిఎం గౌరీ శంకర్, సిసి వెంకటలక్ష్మీ, భాగ్య, పురుషోత్తం, ఎంఎస్ఎ మానస, అధ్యక్షురాలు మమత, కోశాధికారి అంజలి, గ్రామసంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## పిఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించాలి: సిఐటియు


మున్సిపల్ కార్మికులతో సిఐటియు నాయకులు

**సదాశివపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
సదాశివపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు గత తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ డబ్బులను తక్షణమే వారి ఖాతాల్లో జమచేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వి.ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంముందు కార్మికులు ధర్నానిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సిహెచ్ శ్రీనివాస్, యూనియన్ నాయకులు అంజయ్య, చౌదరి మల్లేష్, రాజు, అనిల్, అక్కమ్మ, రుక్కమ్మ, సంతోష, ప్రమీల, లక్ష్మి, మొగులమ్మ తదితరులు పాల్గొన్నారు.

## యోగ ప్రతి ఒక్కరి జీవితంలో భాగస్వామ్యం

### -పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్ దృశ్యం

**పటాన్‌చెరు, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
నేటి వేగవంతమైన జీవనశైలిలో ఆరోగ్యం పరిరక్షణకు యోగ అత్యంత అవసరమని, ప్రతి ఒక్కరిజీవితంలో భాగస్వామ్యం కావాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని పివి నరసింహరావు ఆడిటోరియంలో పతంజలియోగా సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వారంరోజుల ఉచిత మెగా యోగ, ఆరోగ్యశిబిరాన్ని సోమవారం ఉదయం ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, పతంజలియోగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు శివుడు, నరసింహ, యోగాకమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## జనగణన-2027 సర్వేకు సిద్ధం..

### -తహసీల్దార్ రజనీకుమారి

**రామాయంపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
రామాయంపేట మండల కేంద్రంలో సోమవారం జనగణన-2027 సర్వేనిర్వహణకు సంబంధించి కీలక కార్యక్రమం జరిగింది. కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ సర్వేను పకడ్బందీగా అమలు చేయాలని తహసీల్దార్ రజనీకుమారి సూచించారు. ఈసందర్భంగా సూపర్వైజర్లకు ప్రత్యేకశిక్షణ ఇవ్వడంతోపాటు 52మంది ఉపాధ్యాయులకు సర్వేకిట్లను పంపిణీచేశారు. క్షేత్రస్థాయిలో ఎలాంటిపొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా పనిచేయాలని, ప్రతి ఇంటివివరాలను కచ్చితంగా నమోదు చేయాలని తహసీల్దార్ ఆదేశించారు. జనగణనసర్వే దేశ అభివృద్ధి ప్రణాళికలకు పునాదికావడంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ గౌస్‌తోపాటు రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వడగండ్ల వానతో రైతాంగానికి భారీ నష్టం..

## వెంటనే పరిహారం చెల్లించాలి: బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు..


నేలకొరిగిన వరి పంటను చూపెడుతున్న బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు

**రామాయంపేట, ఏప్రిల్ 20, ప్రభాతవార్త:**
రామాయంపేట మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన అకాలవర్షం, వడగండ్లవానతో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు డిమాండ్‌చేశారు. సోమవారం వర్షంతో నష్టపోయిన పలు వరిపంటలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి, కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట నేలపాలైందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతి రైతు పొలంలో సుమారు 20 శాతం నుంచి 40 శాతం వరకు వడ్లు నేలకూలిపోవడంతో, ఈసారి వరి దిగుబడి గణనీయంగాతగ్గే ప్రమాదం నెలకొందన్నారు. వరి రైతులతో పాటు మామిడి రైతులు కూడా తీవ్రనష్టాన్ని చవిచూశారని తెలిపారు. మండలంలోని అనేక మామిడితోటల్లో వడగండ్ల దెబ్బకు మామిడికాయలు పెద్ద ఎత్తున నేలపై రాలిపోవడంతో రైతులకు భారీ ఆర్థికనష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో కూడా రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది ఇప్పటివరకు స్పందించకపోవడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తంచేశారు. నష్టపోయిన రైతులను గుర్తించి, వెంటనే పంట నష్టాన్ని అంచనావేసి పరిహారం అందించాలని వారు డిమాండ్‌చేశారు. జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యంచేసుకుని రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓబిసి కిసాన్ మోర్చా జిల్లా నాయకులు చిన్నోళ్ల రంగన్న, పట్టణ నాయకులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.